క్లుప్తంగా

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

• జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి



సరుకులు పరిశీలిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

హిందూపురం అర్బన్: ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని .. అనారోగ్యానికి గురైతే ఎప్పటి కప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి ఉప కారాగార అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక సబ్ జైలును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా ఖైదీలతో మాట్లాడారు. ఏ నేరాల్లో జైలుకు వచ్చారు? ఎప్పటి నుంచి జైళ్లలో ఉంటున్నారు? న్యాయవాదులను ఏర్పాటు చేసుకున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నాయవాదులను పెట్టుకునే స్థోమత లేని వారు దరఖాస్తు చేసుకొంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జైలు గదులను పరిశీలించారు. వంటకు వినియోగించే నిత్యావసర వస్తువులు, వాడుతున్న కూరగాయాలను పరిశీలించారు.

ఫెలోషిప్‌కు ఎంపిక



జయశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రగతి, అధ్యాపకులు

హిందూపురం టౌన్: స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న జయశ్రీ సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. మంగళవారం ఆ కళాశాలలో విద్యార్థిని జయశ్రీని అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ రసాయనశాస్త్రంలో బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రతినిధులు నిర్వహించిన ఎంపిక పోటీల్లో జయశ్రీ ప్రతిభ కనబరచి ఫెలోషిప్‌కు ఎంపికకావడం కళాశాలకే గర్వకారణమన్నారు.

విద్యార్థులకు బహుమతులు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వైస్ ప్రిన్సిపాల్ జయప్ప మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. అధ్యాపకులు రామన్న, ప్రతాప్, యశోదారాణి, శ్రీదేవి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహారెడ్డికి పరామర్శ



నరసింహరెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి తూమకూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ రొళ్ల మండల కన్వీనర్ నరసింహారెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు పరామర్శించారు. కుటుంబ సభ్యులు, వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గుడిబండ మండలం జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అశ్వత్థనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగ పూజ



పాలబావి దగ్గర అమ్మవారికి గంగ పూజ చేస్తున్న దృశ్యం

రొళ్ల: రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గంగా పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మహామంగళారతి ఇచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు ఉత్సవ విగ్రహాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షణ చేయించారు. తర్వాత పాలబావి వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టం కూర్చోబెట్టారు. గంగా జలంలో అమ్మవారి విగ్రహాన్ని శుద్ధిచేసి పూజలు చేశారు. ఆతర్వాత ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలోకి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. ఎమ్మెల్సీ మంగమ్మ పూజల్లో పాల్గొన్నారు.

స్వచ్ఛత ఏదీ ?



ముగుగునీటి కాలువలో పాచిగట్టిన దృశ్యం



తిమ్మగానిపల్లిలో మూసుకుపోయిన కాలువ



కంచిసముద్రంలో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాలువ

• గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
• రోగాలు ప్రబలుతున్నాయని ప్రజల ఆందోళన
• పట్టించుకోని అధికారులు

లేపాక్షి: స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వచ్ఛతాహీ సేవా పేరుతో ప్రభుత్వం ప్రచారం మాత్రం జోరుగా చేస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేయడంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకు పోయి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు నీరు డ్రైనేజీల నుంచి మురుగు నీరు పొంగి రోడ్లపై పారుతున్నాయి. దీంతో మురుగు నీటి దుర్వాసనతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. గ్రామాల్లో మూడు నెలలకు ఒకసారి కూడా డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. ఇక డ్రైనేజీలు లేని గ్రామాల్లో పరిసరాలు మరింత ఘోరంగా ఉన్నాయి. డ్రైనేజీలు లేని గ్రామాల్లో మురుగు నీరు ఇళ్ల ముందు పోతుండటంతో ప్రజలు ఘర్షణకు దిగుతున్నారు.

నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్లు

లేపాక్షి మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయితీలు ఉండగా అందులో 45,122 జనాభా ఉంది. మండల వ్యాప్తంగా 12 ఫాగింగ్ మిషన్లు ఉండగా అందులో లేపాక్షి పంచాయతీ మినహా మిగిలిన పంచాయతీల్లో వాటిని వినియోగించడం లేదని చెబుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి నిరుపయోగంగా ఉన్నాయని తెలుస్తోంది. ఫాగింగ్ మిషన్ల గురించి పట్టించుకునే వారు కూడా లేరు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచడంతో పాటు దోమలు నివారణ కోసం ఫాగింగ్ చేపట్టి, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు, డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్తా చెదారం తొలగించి అపరిశుభ్రత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



మా ఎస్సీ కాలనీలో 30 సంవత్సరాల క్రితం డ్రైనేజీలను ఏర్పాటు చేశారు. అయితే ఆ డ్రైనేజీలు ఉన్నప్పటికీ ఉపయోగంలో లేవు. పైతట్టు ప్రాంతం నుంచి మురుగు నీరు లేదా వర్షపు నీరు ఇంటి వద్దనే నిలువ ఉంటున్నాయి. ఆ నీరు ఎక్కడికి పోకపోవడంతో నీళ్లు ఇళ్లలోకి చేరుతున్నాయి. రోజూ ఇంటి ముందు డ్రైనేజీని తామే స్వయంగా పరిశుభ్రం చేసుకోవాల్సి వస్తోంది. లేకపోతే దోమలు, ఈగలు, విష పురుగులు కాలువల నుంచి వస్తున్నాయి. ఈ విషయం అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన ప్రయోజనం లేకపోయింది.

– పుట్ట నరసమ్మ, తిమ్మగానిపల్లి, లేపాక్షి మండలం

రోగాలు రాకుండా చూడాలి



గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం పేరుకు పోయింది. కంచిసముద్రం నుంచి నగరిగెరకు వెళ్లే మెయిన్ రోడ్డులో డ్రైనేజీలు నిండి రోడ్డుపై పోతున్నాయి. ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. అటుగా వెళ్లే వారు దుర్వాసన భరించ లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది. కనీసం ఇప్పటికైనా రోగాలు ప్రబలకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆనంద్, కంచిసముద్రం లేపాక్షి



శిక్షణకు ఎంపిక

హిందూపురం టౌన్: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కిలో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో జరిగే ప్రత్యేక నాయకత్వ లక్షణాల శిక్షణకు పట్టణంలోని స్థానిక ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి ఎంపికయ్యారు. ఆమె ఎంపిక పట్ల కళాశాల సిబ్బంది, కళాశాల అభివృద్ధి, ప్రణాళిక మండలి సభ్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



కనుమ మారెమ్మకు జ్యోతులను సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు

మడకశిర: పట్టణంలో కనుమ మారెమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. వాల్మీకి సర్కిల్‌లోని కొల్లాపురమ్మ ఆలయంలో కొలువు దీరిన కనుమ మారెమ్మకు వేలాది మంది భక్తులు జ్యోతులను సమర్పించారు. ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు శాంతి భద్రతలను పరిక్షించేందుకు పోలీసులు డ్రోన్లను ఉపయోగించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, రవిశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

‘కూటమి’పై ప్రజల్లో వ్యతిరేకత

• వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



విలేకర్లతో మట్లాడుతున్న ఈరలక్కప్ప

మడకశిర: చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంపై తక్కువ కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. మంగళవారం ఆయన మడకశిరలో జరిగిన కనుమ మరెమ్మ జాతర మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబుకు ఓటు వేసి తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని పేర్కొన్నారు. టీడీపీ కార్యకర్తలు కూడా చంద్రబాబుపై అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడం ఖాయమని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టడమే కూటమి ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ నారా లోకేశ్ కూడా తన రాజకీయ భవిష్యత్‌ను నాశనం చేసుకున్నారని పేర్కొన్నారు. నారా లోకేశ్‌ను రాష్ట్ర ప్రజలు ఇక ఆదరించరని, మరోసారి వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత







హిందూపురం: డెమో ద్వారా మంటలు ఆర్పే విధానాన్ని చూపుతున్న ఫైర్ సిబ్బంది , మడకశిర: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫైర్ సిబ్బంది , పెనుకొండలో...

హిందూపురం అర్బన్: అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఫైర్ ఆఫీసర్ డీ.ప్రభాకర్ తెలిపారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం హిందూపురంలోని గురునాథ్ సర్కిల్, రహమత్‌పూర్ సర్కిల్, చిన్నమార్కెట్ సర్కిల్‌లో ఫైర్ జరిగినప్పుడు ఎలా ప్రమాదాల నుంచి బయట పడాలి అన్న విషయాన్ని డెమో ద్వారా ఫైర్ సిబ్బంది చేసి చూపారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే 08556 220888 (101)కు సమాచారం ఇవ్వాలన్నారు.

పెనుకొండ: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ వెంకటేశులు సూచించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్లో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. వివిధ రకాల పైపులతో మంటలను ఎలా ఆర్పవచ్చో కళ్లకు కట్టినట్లు చూపించారు.

మడకశిర: అగ్ని ప్రమాదాలపై మంగళవారం పట్టణంలో అవగాహన కల్పించారు. అగ్నిమాపక కేంద్రం అధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో ప్రజలకు కర పత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా మంటలను అదుపు చేయాలో వివరించారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

హిందూపురం టౌన్: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులకు మూడు రోజుల నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ రాము మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులు రిటైర్డ్ అయిన తర్వాత రూ.75 వేలు ఇస్తామని, అలాగే కార్మికుడు చనిపోతే మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇస్తామని, డ్రైవర్లకు రూ.24 వేలు జీతం ఇస్తామని వాటితో పాటు మరి కొన్ని సమస్యలకు జీఓలు జారీ చేసిందన్నారు. అయితే ఆ జీఓలను అమలు చేయాలని అడుగుతుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్మికులకు మద్దతుగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, మున్సిపల్ యూనియన్ పట్టణ కార్యదర్శి జగదీష్, అధ్యక్షుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

పెనుకొండ: ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా వారి ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకుడు బాబావలి కమిషనర్ సతీష్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీలో 25 సంవత్సరాలుగా విషవాయువులతో సహవాసం చేస్తూ ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. కార్మికులకు ఇబ్బందులు కలిగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వెంకటేష్, చంద్ర, నరసింహ, సుదర్శన్, యణి, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండయ్యా..



లేబర్ అధికారికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

హిందూపురం: ‘హిందూపురం తూమకుంట పారిశ్రామికవాడలోని ఆప్టా సింథసిస్ ప్రైవేట్ లిమిటెడ్ రసాయన పరిశ్రమలో పనిచేస్తున్న 28 మంది కార్మికులతో పాటు మరికొందరికి యాజమాన్యం రెండు, మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదు. వెంటనే బకాయి పడ్డ వేతనాలు ఇప్పించండి’ అంటూ పారిశ్రామికవాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్‌తో కలసి కార్మికులు.. కార్మికశాఖ సహాయ లేబర్ ఆఫీసర్ శేఖర్‌బాబుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం లేబర్ ఆఫీసుకు తరలివెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్మికులు వారం రోజుల నుంచి పలుమార్లు జీతాలు ఇవ్వాలని ప్రాధేయపడుతున్నా యాజమాన్యం స్పందించడం లేదన్నారు. కార్మిక చట్ట ప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు ఇవ్వాల్సిన జీతాలు చెల్లించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మారుతీరెడ్డి, సిద్ధగిరి సురేష్, సమీవుల్లా, ముత్యాలప్ప, ఈరప్ప తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

గోరంట్ల: మండల సర్వ సభ్య సమావేశం మంగళవారం జరగాల్సి ఉండగా కోరం లేక వాయిదా పడింది. బూదిలి ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్ మినహా ఇతర సభ్యులతో పాటు ఎంపీపీ ప్రమీల, ఉపాధ్యక్షుడు నాగభూషణరెడ్డి, రామలక్ష్మమ్మ హాజరుకాకపోవడంతో ఎంపీడీఓ సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేశారు. మంత్రి సవిత ఆదేశాలమేరకు ఎంపీడీఓ పనిచేస్తుండటంతో ఆయన తీరు నచ్చకనే సమావేశానికి వారు గైర్హాజరైనట్లు తెలిసింది. మండల పరిషత్‌కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు ఉన్నప్పటికీ ఎంపీటీసీలకు నిధులు కేటాయించలేదని, అలాంటప్పుడు తామెందుకు సమావేశానికి రావాలని కొందరు ఎంపీటీసీలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. బుధవారం నిర్వహించే సమావేశానికి సైతం హాజరుకాబోమని చెబుతున్నారు.

‘ఆ డీలర్ వద్ద సరుకులు తీసుకోం’



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణపల్లి గ్రామస్తులు

గోరంట్ల: మా ఊరు రేషన్ షాపు డీలరుకు, గ్రామస్తులకు రాజకీయంగా సరిపోవడం లేదు. ఆయన వద్ద మేము రేషన్ సరుకులు తీసుకోము. మా గ్రామంలోని 90 కుటుంబాల పేదలకు సచివాలయంలో ప్రత్యేక స్టోర్ ఏర్పాటు చేయండి. అలా కుదరని పక్షంలో పక్క గ్రామంలోని స్టోర్‌కు మా రేషన్‌కార్డులను అలాట్‌మెంట్ చేయండి’ అని మండల పరిధిలోని వెంకటరమణపల్లి గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ మారుతీ వద్ద మొరపెట్టుకున్నారు. మంగళవారం వెంకటరమణపల్లి గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని తమ గ్రామ రేషన్ డీలర్ వద్ద సరుకులు తీసుకోమని, తమ సరుకులు ఎక్కడి నుంచేనా తీసుకునే వీలు కల్పించాలని ఆందోళనకు దిగారు. ఆరు నెలలుగా పక్క గ్రామంలోని రేషన్ డీలర్ వద్ద సరుకులు తీసుకుంటున్నామని, ఎక్కడి నుంచైనా సరుకులు తీసుకోవచ్చని నిబంధనలు చెబుతున్నా అధికారుల ఆదేశాలతో తమ పక్క గ్రామంలోని రేషన్ డీలర్ కూడా సరుకులు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రమంతా ఒక నిబంధన పాటిస్తుంటే.. గోరంట్లలోని రెవెన్యూ అధికారులు మాత్రం తమ సొంత అజెండా అమలు చేస్తూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నేడు వీర ముత్తప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో ముత్తప్పస్వామి



స్వామివారికి 101 ప్రసాదాలు సమర్పిస్తున్న దృశ్యం

అగళి: మండల పరిధిలోని ముత్తేపల్లిలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో వీరముత్తప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం హారతి, జలధి ఉత్సవం, కలశ పూజ, పంచామృతాభిషేకం, గణపతి హోమం, తదితర కార్యక్రమం నిర్వహించారు. ప్రతిష్టాపన కార్యక్రమం హనుమంతనాథస్వామిజీ సారథ్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

అసిస్టెంట్ కమిషనర్‌గా వెంకటేశ్వర్లు

చిలమత్తూరు: హిందూపురం మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం. వెంకటేశ్వర్లు నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెంకటేశ్వర్లు అనంతపురం నగర పాలక డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

నేడు మండల మీట్

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంతో బుధవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్ర కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఏఐటీయూసీ సభ్యుడి మృతికి నివాళి

పెనుకొండ: పట్టణానికి చెందిన ఏఐటీయూసీ సభ్యుడు ఓబులేసు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ డివిజన్ నాయకులు శ్రీరాములు తదితరులు ఓబులేసు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ నాయకులు కిరణ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి

పావగడ: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని క్రీడా మైదానంలో కర్ణాటక ఆది జాంబవ అభివృద్ధి మండలి నుంచి మంజూరైన పంపు, మోటార్లు తదితర విద్యుత్ పరికరాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మాజీ మంత్రి వెంకటరమణప్ప 20 మంది లబ్ధిదారులకు పరికరాలు అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పరిగి: మండలంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో నాలుగు ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. గణపతిపల్లి వద్ద ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతో పాటు శాసనకోట వద్ద మరో రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశామన్నారు.

టీ కేఫ్‌లలో పోలీసుల తనిఖీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని టీకేఫ్‌లలో పోలీసులు మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. గంజాయి వినియోగించే పలువురు అనుమానాస్పద యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏఎస్ఐ నారాయణస్వామి, కానిస్టేబుల్ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీకి సామగ్రి వితరణ

పెనుకొండ: పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హూండాయ్ ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులు రూ. 25 లక్షల విలువజేసే 20 కంప్యూటర్లు, ఇతర సామగ్రిని మంగళవారం అందజేసినట్లు ప్రిన్సిపల్ సుదర్శన్ తెలిపారు. కళాశాలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆ సంస్థ సీఈఓ సాంసంగ్ యూన్‌సాంగ్, డోయూన్ కిమ్ చేతుల మీదుగా కళాశాలకు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు హూండాయ్ ప్రతినిధులు రూ. 10లక్షలతో ప్రహరీ, లైబ్రరీ, మంచినీటి సౌకర్యం కల్పించడానికి సహకారం అందించారు.

అధ్యాపకురాలికి సన్మానం

హిందూపురం టౌన్: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలైన గీత జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ ఆధ్వర్యంలో గీతను ఘనంగా సన్మానించారు.

నవీన్, లోకేష్ అరెస్ట్ అన్యాయం

• వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి

మడకశిర: వైఎస్సార్‌సీపీ జిల్లా బూత్ కన్వీనర్ వాల్మీకి లోకేష్, దళిత నాయకుడు నవీన్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముదిరెడ్డిపల్లికి చెందిన మోహన్‌కు మంచి మాటలతో లోకేష్, నవీన్ బుద్ధి చెప్పారన్నారు. అయితే బార్‌లో వ్యక్తిగత కారణాలతో కొందరు మోహన్‌పై దాడి చేస్తే దానిని నవీన్, లోకేష్‌కు ముడిపెట్టి వారిపై పోలీసులు అక్రమంగా కేసులు బనాయించడమే కాక, అరెస్ట్ పేరుతో హిందూపురంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి వన్‌టౌన్ పీఎస్ వరకూ బేడీలు వేసి నడిపించుకెళ్లడం దుర్మార్గమన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏకి పోలీసులు తొత్తులుగా మారి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

మడకశిర: పట్టణంలోని పాత మసీదు వద్ద ఆపి ఉంచిన ఓ ద్విచక్ర వాహనం మంగళవారం రాత్రి అపహరణకు గురైనట్లు తెలిసింది. ఆ బైక్ ఓ గ్రామ కార్యదర్శిదని సమాచారం. ప్రస్తుతం పట్టణంలో 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో దొంగలను పట్టుకునేందుకు పోలీసులకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయే లేదో చూడాలి.